# ప్రతిధ్వని

శ్రీనివాసరావుకి చాలా ఆనందంగా వుంది.

అతని చిరకాల వాంఛ నెరవేరబోతోంది.

అన్ని పత్రికలూ అతని రచనల్ని తిప్పి కొట్టినా ఆకాశవాణి మాత్రం అవకాశమిచ్చి రచయిత ముద్ర వెయ్యబోతోంది!

ఈ విషయం అందరికీ తెలియాలి.

ఎలా?

తెగ ఆలోచించాడు.

ఆఫీసులో అందరికీ పెద్ద ఎత్తున పార్టీ ఇచ్చి, సగర్వంగా మరీ అనౌన్స్ చేశాడు- ఫలానా రోజున తన కథ రేడియోలో రాబోతోందని! అంతటితో వూరుకోకుండా 'దానిమీద మీమీ అమూల్యాభిప్రాయాల్ని ఆకాశవాణికి రాయం'డంటూ, అందర్నీ అభ్యర్థించాడు.

ఊళ్ళో వున్న వాళ్ళందరికీ చెప్పడం కాగానే పొరుగూళ్ళలో వున్న వాళ్ళందరికీ ఉత్తరాలు రాయడం ప్రారంభించాడు. మరో రెండు రోజులు చకచకా గడిచిపోయాయి. శ్రీనివాసరావు పబ్లిసిటీ కార్యక్రమం పూర్తయింది.

ముచ్చటగా మూడొందల రూపాయలు ఖర్చయిపోయినా అతనికేమీ బాధనిపించలేదు.

అందరూ తన కథని వింటారు. బాగుందంటూ ఆకాశవాణికి రాస్తారు. వాళ్ళు మరో కథని రాయమంటారు. అప్పుడూ తనిలాగే రాస్తాడు అందరికీ.... తన కథలకి తెగ రెస్పాన్స్ వస్తుండడంతో ఆకాశవాణివాళ్ళు తెగ కాంట్రాక్టులిస్తారు. రచయితగా తనకో ముద్ర పడిపోతుంది. అప్పుడు చచ్చినట్లు తన పేరు కోసమైనా మిగతా పత్రికలవాళ్ళు కథలు వేసు కుంటారు.

ఇలా రకరకాల కలలు కొనసాగిస్తూ కనసాగాడు.

శ్రీనివాసరావు కథ ప్రసారమయ్యే రోజు రానే వచ్చింది.

ఇంటి చుట్టుపక్కలవాళ్ళని, ఇంట్లోని వాళ్ళని అందర్నీ బలవం తాన అరెస్ట్‌చేసినట్లు రేడియో దగ్గరకి చేర్చాడు.

క్షణ క్షణం శ్రీనివాసరావులో టెన్షన్ పెరగసాగింది.

కథ ప్రసారమయ్యే టైమ్ అయింది

చటుక్కున రేడియో వాల్యూమ్ పెంచి కూర్చున్నాడు శ్రీనివాస రావు.

చీమ చిటుక్కుమన్నా వినిపించే శబ్దం ఒక్క క్షణం—

హఠాత్తుగా రేడియో అరిచింది.

"ప్రకటించిన కార్యక్రమానికి బదులుగా అనివార్య కారణాలవల్ల సుబ్బలక్ష్మిగారి, ఋతువులు ఎలా ఏర్పడతాయి - ప్రసంగం."

ఒక్కసారి అందరూ ఘొల్లుమన్నారు.

తన కథ ప్రసారం ఎందుకాగిపోయిందో అర్థంకాక తికమక పడుతున్న శ్రీనివాసరావు కూడా ఛళ్ళున నవ్వాడు. కానీ వెంటనే గుర్తొచ్చింది- తన కథ ప్రసారం ఆగిపోయిందని! అంతే. సీరియస్సై పోయాడు.

కథా నిలయం
1529
శ్రీకాకుళం



సీరియస్ అయి ఏం చెయ్యగలడు? ఎదురుగా ఆకాశవాణి వాళ్ళు ఎవరైనా వుంటేనే కదా? ఉన్నవాళ్ళందరూ తన కథ వినడానికి చేరిన వాళ్ళు! కోపం మాటటుంచి వాళ్ళముందు తల ఎత్తుకు తిరగడం ఎలా?

ఆఫీస్‌కి వెళ్తే అక్కడ నవ్వేవాళ్ళూ వుంటారు! వాళ్ళందర్నీ ఎలా ఫేస్ చెయ్యడం?....

"శ్రీనివాసరావుగారూ! మీ కథ రానట్టేగా? ఇక వస్తాం...." అన్నారు ఒక్కొక్కళ్ళే లేచి బయల్దేరి.

తను కూర్చున్న ఫళానే లోపలికి దిగిపోతే బాగుండని తలపోశాడు శ్రీనివాసరావు.

అందరూ వెళ్ళిపోయారు.

"పరువు తీశారు కదండీ!.... రేపటినుంచి తలెత్తుకుని ఎలా తిరగ్గలం?...." మూతి మూడువంకర్లు తిప్పి లోపలికి వెళ్ళిపోయింది శ్రీనివాసరావు శ్రీమతి.

మరింత సిగ్గుతో కుంగిపోయాడు శ్రీనివాసరావు.

ఇకముందు పొరబాటున కూడా కూడా కథలు రాయకూడదని, రాసినా రేడియోకి పంపకూడదని వట్టేసుకున్నాడు.

అవమానాల మధ్య ఒక వారం అతి భారంగా గడిచింది శ్రీనివాస రావుకి-

ఆ రోజు అనుకోకుండా ఇంట్లో వున్న శ్రీనివాసరావు చెవుల్లో రేడియో కార్యక్రమం చొచ్చుకుపోసాగింది.

రేడియో కార్యక్రమాలపై శ్రోతల అభిప్రాయమాలిక - అనౌన్స్‌మెంట్ రాగానే ఓ బొంగురు గొంతు ప్రారంభమైంది:

"మేము ప్రసారం చేస్తున్న కార్యక్రమాలన్నింటినీ శ్రద్ధగా విని తమ అభిప్రాయాలు రాస్తున్న శ్రోతలకు ముందు మా ధన్యవాదాలు. గతవారం ప్రసారమైన శ్రీనివాసరావుగారి కథ నచ్చిందంటూ మా కార్యాలయానికి అసంఖ్యాకంగా ఉత్తరాలు వచ్చాయి. ముందు వాటిని పరిశీలిద్దాం...." అంటూ ఆ బొంగురుగొంతు కొన్ని పేర్లను కరువులేనట్లుగా ఏకరువు పెట్టసాగింది.

ఆశ్చర్యం....! అవన్నీ అతని బంధు స్నేహితుల పేర్లు....!!

అంటే....వాళ్ళందరూ ఆ రోజు రేడియో వినకుండా మొహమాటానికి రాస్తే రేడియోవాళ్ళు ఏ మొహంతో చదువుతున్నారో అయోమయంగా అనిపించింది శ్రీనివాస్‌కి.

ఇంతలో శ్రీమతి నవ్వు అతి వికారంగా తగిలింది అతని చెవులకి. భరించలేకపోయాడు.

చటుక్కున ఒక్కదూకులో రేడియో చేరుకుని దాన్ని కట్టేశాడు.

ఇప్పుడు రేడియో నుండి వచ్చే చిన్న ధ్వని విని కూడా భరించలేని స్థితిలో వున్నాడు శ్రీనివాసరావు. ఆఫ్‌కోర్స్- కథలు రాయటం మానేశాడని వేరే చెప్పనక్కర్లేదనుకోండి *

(హాస్యప్రభ మాసపత్రిక)